భౌ.. భౌ అంటే భయభ్రాంతులే..

- అరుపు వింటే చాలు ప్రజలు హడల్
- కుక్కల నిర్మూలనకు చర్యలేవీ
- ప్రయాణికులకూ తప్పని బెడద
- అన్ని గ్రామాల్లోనూ ఇదే తీరు



తూర్పుపాలెంలో ఇటీవల కుక్కల దాడిలో చనిపోయిన మేకల వద్ద దిగాలుగా రైతులు (ఫైల్)



మలికిపురంలో స్వైరవిహారం చేస్తున్న శునకాలు

మలికిపురం: గ్రామాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వాటి నిర్మూలన మాత్రం ప్రహసనంగా మారింది. ఫలితంగా శునకాలు ప్రజల పాలిట ప్రాణసంకటంగా మారాయి. రాజోలు దీవిలో అనేక గ్రామాల్లో కుక్కల బెడద రానురానూ మరింత తీవ్రమైంది. మనుషులపై దాడి చేసి కరవడంతో పాటు. పశువులను, మేకలు, కోళ్లపై కూడా దాడి చేసి హతమారుస్తున్నాయి. కుక్కల దాడి ఫలితంగా రూ.లక్షలు విలువైన మేకలను, కోళ్లు, పశువులను ప్రజలు నష్టపోతున్నారు. ఇటీవల సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కుక్కల దాడిలో పలువురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. అప్పనరామునిలంకలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి సుమారు పది మందిని తీవ్రంగా గాయపరచింది. ఒక ఆవును కూడా గాయపరిచింది. అలాగే విశ్వేశ్వరాయపురం, మలికిపురం, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, రాజోలు, చింతలపల్లి, ములికిపల్లి, పొన్నమండ, కాట్రేనిపాడు, కడలి, తాటిపాక, శివకోడు మెయిన్, శివకోడు లాకులు, దిండి, రామరాజులంక, శంకరగుప్తం, గూడపల్లి, లక్కవరం, బట్టేలంక తదితర గ్రామాల్లో వారపు సంతలు కుక్కలకు ఆవాసాలుగా మారాయి. తూర్పుపాలెంలో కూడా ఇటీవల మేకల మకాంపై కుక్కలు దాడి చేయడంతో సుమారు లక్షా యాభై వేల రూపాయల విలువైన మేకలు చనిపోయాయి. ఇదే గ్రామంలో గత ఐదేళ్లుగా ఇటువంటి సంఘటనలు జరుగుతూనే ఉంటున్నాయి. సుమారు 20 మేకలను మరో రెండు ఆవు దూడలను కూడా హతమార్చడంతో పాటు, పలు గేదెలను, తీవ్రంగా గాయపరచాయి. రోడ్డుపై వెళ్లే వాహనదారులను, పాదచారులను కూడా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరచాయి.

కుక్కలకు స్థావరాలుగా మార్కెట్లు

గ్రామాల్లోని మార్కెట్ ప్రాంతాలు కుక్కలకు ప్రధాన స్థావరాలుగా మారుతున్నాయి. అక్కడ మాంసం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మాంసం వ్యర్థాలు ఇక్కడే పడేస్తున్నారు. గత పదేళ్లుగా ఇదే తంతు. మాంసానికి అలవాటు పడ్డ కుక్కలు మార్కెట్‌లో మాంసం వ్యర్థాలు దొరక్కపోతే మేకలు, కోళ్లు, పశువులు, మనుషులపై దాడులకు పాల్పడుతున్నాయి. అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యమని ప్రజలు వాపోతున్నారు. చాలా గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. వీటి నిర్మూలనకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా కుక్కల సంఖ్య నానాటికీ అధికమవుతుంది. ప్రస్తుతం ఒక్కో గ్రామంలోనూ 100 పైబడే కుక్కలు ఉన్నట్లు అనధికార అంచనా. మేజర్ పంచాయితీల్లో అయితే ఈ సంఖ్య మరీ అధికం. గ్రామాల్లో కుక్కల నిర్మూలనకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వాటి సంఖ్య నానాటికీ అధికమైంది.

పిచ్చికుక్కలను కూడా చంపడం లేదు

సాధారణంగా ఒక మోస్తరు ఆరోగ్యకరంగా ఉన్న కుక్కలను చంపకూడదనే నిబంధన ఉంది. జంతు సంరక్షణ సంస్థల కారణంగా ప్రభుత్వం ఈ నిబంధన విధించింది. అయితే పిచ్చికుక్కలను హతమార్చాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చినా గ్రామ పంచాయితీలు వీటి నిర్మూలనకు అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. అలాగే కుక్కల సంతతి వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ చర్యలు కానరావడం లేదు. దీంతో కుక్కల సంచారం నానాటికీ అధికమైంది.

సామూహిక నివారణ అవసరం

కుక్కల నిర్మూలనకు అన్ని పంచాయతీలు కలిపి ఒకేసారి సామూహిక చర్యలు చేపట్టడం అవసరం. కుక్కలను నిర్మూలించే వ్యక్తులు తక్కువగా ఉండడం వల్ల పంచాయతీలకు ఇబ్బంది అవుతుంది. ఇటువంటి సమయంలో నాలుగైదు పంచాయితీలు కలిపి ఒకేసారి కుక్కల నిర్మూలన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సూచిస్తున్నారు.

కుక్కల బెడద తీవ్రం



గ్రామాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఇష్టానుసారం ప్రజలపై దాడి చేస్తున్నాయి. పశు సంపదను నష్టపరుస్తున్నాయి. రైతులు నష్టపోతున్నారు. కుక్కల బెడద నుంచి ప్రజలను, పశు సంపదను రక్షించాలి.

– తాడిసహదేవ్, ఉయ్యూరివారిమెరక

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడిగా శ్రీకృష్ణ

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ ఆదుర్రు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నాగాబత్తుల శ్రీకృష్ణను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా జరిగిన పార్టీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన సురేంద్రను పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము అభినందించారు. వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసే దిశగా గ్రామ కమిటీ పని చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ నేతలు జక్కంపూడి వాసు, కుసుమ శ్రీను, కుడుపూడి రామారావు, పితాని సురేంద్ర, దాకే అశోక్, భూపతి సురేష్, తోరం త్రినాథ్, గనిశెట్టి రాంబాబు, ముడకల సత్యనారాయణ పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం



చైర్మన్‌ను అభినందిస్తున్న గ్రామస్తులు

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. పీఏసీఎస్ అధ్యక్షుడిగా జాస్తి భాస్కరరావు, సభ్యులుగా మోటిపల్లి శ్రీనివాసరావు, కత్తుల రాజశేఖర్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఎస్‌బీపీకే సత్యనారాయణరావు కమ్యూనిటీ హాలులో త్రిసభ్య కమిటీ అభినందన సభ జరిగింది. మండలం నలుమూలల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కూటమి నేతలందరూ త్రిసభ్య కమిటీని ఘనంగా సత్కరించారు. అలాగే చొప్పెల్లలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, సభ్యులుగా ఎన్.స్వామి, పంపన సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీకృష్ణ ప్రభాస్ పేపర్‌మిల్లు అధినేత వంక సత్యనారాయణ, వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు, సలాది నాగేశ్వరరావు, గారపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మామిడికుదురు: ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌వీవీ సత్యనారాయణ సూచించారు. పాశర్లపూడిలంక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కొబ్బరిలో అంతర పంటల సేద్యం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చెరుకూరి సత్తిబాబు, తెలగారెడ్డి బులినాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సుందర సందేశం పుస్తకావిష్కరణ


ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో మంగళవారం సుందర సందేశం పుస్తకావిష్కరణ జరిగింది. అంగర లక్ష్మి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు అంగర గోపాలాచార్యులు (కృష్ణశ్రీ) రచించిన ఈ పుస్తకాన్ని వాల్మీకి రామాయణంలోని సుందరకాండలో కొన్ని ప్రధాన సందేశాత్మక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈపుస్తకాన్ని రచించారు. ఈసందేశాత్మక పుస్తకాన్ని గ్రామ పెద్దలు దొడ్డా సుబ్బారావు, సూరపురెడ్డి బాబ్జీ, సూరపురెడ్డి గోపాలకృష్ణ ఆవిష్కరించారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ



కొర్లపాటివారిపాలెంలో సారెను తీసుకువెళుతున్న భక్తులు

అంబాజీపేట/సఖినేటిపల్లి: అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వనువులమ్మ అమ్మవారికి సుమారు 200 రకాల పిండివంటలు, మిఠాయిలు, పండ్లు, చలిమిడి–పానకాలతో అమ్మవార్లకు భక్తులు సారె చెల్లించుకున్నారు. ముందుగా రామాలయం వద్ద నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం మీదుగా సత్తెమ్మ తల్లి, కనకదుర్గమ్మ ఆలయాలను దర్శించుకుని వనువులమ్మకు సారె సమర్పించారు. అనంతరం సారెను గ్రామంలోని ప్రతి ఇంటికీ పంచారు. సఖినేటిపల్లి మండలంలోని అప్పనరామునిలంకలో కొలువైన ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు మంగళవారం భక్తులు సారె సమర్పించారు. ఆషాఢమాసం పురస్కరించుకుని ఆలయంలో అమ్మవార్లకు వివిధ రకాలు స్వీట్లు సారెగా సమర్పించారు.



అప్పనరామునిలంకలో అమ్మవార్లకు భక్తులు సమర్పించిన సారె

అక్రమ కేసులు తప్ప సంక్షేమం ఎక్కడ?



పాశర్లపూడిలంక రచ్చబండలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

- కోఆర్డినేటర్ శ్రీనివాసరావు
- పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

మామిడికుదురు: అక్రమ కేసులు, వేధింపులు తప్ప రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఎక్కడ అని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి ప్రశ్నించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రామచంద్రరావు, పరిశీలకుడు తోరం సూర్యభాస్కర్ పర్యవేక్షణలో పాశర్లపూడిలంక, లూటుకుర్రు, మాకనపాలెం, ఆదుర్రు గ్రామాల్లో జరిగింది. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను ఏ విధంగా ఎగ్గొట్టిందో వివరించారు. ఇంటింటికి వచ్చే రేషన్‌ను రద్దు చేసి దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందులు సృష్టించిందన్నారు. ఇది మంచి ప్రభుత్వామా...! చెడ్డ ప్రభుత్వమా...! మీరే చెప్పండని ప్రశ్నించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన రచ్చబండలో మాట్లాడారు. ఎన్నో ఆశలతో అధికారం కట్టబెట్టిన ప్రజల్ని దారుణంగా మోసం చేసిందన్నారు. అరకొరగా అమలు చేస్తున్న కొన్ని పథకాలకు కత్తెర వేస్తూ లబ్ధిదారులను దారుణంగా మోసం చేస్తున్నారని శ్రీనివాసరావు, రాజేశ్వరిదేవి మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి ఆంజనేయులు, పార్టీ నేతలు కుడుపూడి విద్యాసాగర్, మొల్లేటి త్రిమూర్తులు, నెల్లి దుర్గాప్రసాద్, పొలమూరి గోపాల్, అడబాల చక్రపాణి, నాగాబత్తుల శ్రీకృష్ణ, చెల్లింగి రామకృష్ణ, గెడ్డం కృష్ణమూర్తి, జక్కంపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి అభివృద్ధండీ బాబూ..



పూడికతో బురదమయంగా మారిన కొత్తపేట బ్యాంక్ కాలనీల కౌశిక రోడ్డు

కొత్తపేట: స్థానిక కౌశిక డ్రైన్ అభివృద్ధి పేరుతో ఇరువైపులా తీసిన పూడిక గట్టుపైనే కాక రోడ్డు మార్జిన్లు, పలుచోట్ల రోడ్లపై వేసి అలాగే వదిలేశారు. రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమి అభివృద్ధండీ బాబూ.. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందాన ఉంది ఈ కౌశిక డ్రైన్ తీరు.. అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కౌశిక డ్రైన్‌లో గుర్రపుడెక్క, పూడిక తీతకు సంబంధించి ప్రతిపాదించగా రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఆ పనికి టెండరు ఖరారయింది. అయితే ఈలోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అభివృద్ధి ప్రక్రియ నిలిచిపోయింది. కాగా ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రత్యేక గ్రాంటు సుమారు రూ.30 లక్షలు మంజూరయ్యాయి. స్థానిక పంచాయతీ పరిధిలో శీలంవారిపాలెం సమీపం నుంచి పలివెల వంతెన వద్ద ప్రధాన కాలువలో కలుస్తున్నంత వరకు సుమారు నాలుగు కిలోమీటర్లు మేర కౌశిక డ్రైన్ అభివృద్ధి చేయవలసి ఉంది. ఈ పనిని నామినేషన్ విధానంలో ఒక తెలుగు తమ్ముడికి కట్టబెట్టారు. ఇటీవల కొన్ని రోజులుగా ఒక జేసీబీతో కౌశిక ఇరు వైపులా చెత్తా చెదారంతో పాటు పూడిక తీసే కార్యక్రమం చేపట్టారు. కౌశికలో మధ్యన గుర్రపుడెక్క, తూడు మాత్రం అలాగే వదిలేస్తున్నారు. అది తొలగిస్తారో లేదో తెలియదు కాని, తీసిన పూడిక, చెత్త, తూటును మాత్రం గట్టుపైన, తగినంత గట్టు లేనిచోట ఉన్న రోడ్డు మార్జిన్ పైన, అదీ లేని చోట రోడ్డుపైన వేశారు. దాన్ని ఆరాక తొలగించి వేరే చోటికి తరలిస్తారేమో అనుకున్నారు అందరూ కానీ ఎక్కడిది అక్కడే అలాగే వదిలేశారు. దాంతో ఇరువైపులా రోడ్లు కుచించుకుపోయాయి. మూడు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలతో మార్జిన్, రోడ్డుపై పూడిక కరిగిపోయి పలుచోట్ల రోడ్డు బురదమయమైంది. ప్రధానంగా బ్యాంక్ కాలనీ నుంచి న్యూ బ్యాంక్ కాలనీ వెళ్లే రోడ్డు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. కార్లు కాదు కదా బైక్‌లు వెళ్లే పరిస్థితి లేదని పలువురు వాపోయారు. దీనిపై సంబంధిత అధికారిని తొలగించేందుకు ప్రొవిజన్ ఏమైనా వచ్చిందా? అని ప్రశ్నించగా తాను సెలవులో ఉన్నాను అన్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఏఈ ఆనంద్‌ను వివరణ కోరగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన కల్యాణరామ్(ఫైల్)

పి.గన్నవరం: మండలంలోని పోతవరం కళ్యాణ మండపం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ముంగండ శివారు ఇటికెల మెరకకు చెందిన మోకా కళ్యాణ్‌రామ్ (45), అతని మేనల్లుడైన పోతవరం గణేష్ నగర్‌కు చెందిన కుసుమ రవి కుమార్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరూ కూలి పనులు ముగించుకుని మంగళవారం రాత్రి మోటారుసైకిలుపై పి.గన్నవరం నుంచి ఇంటికి వెళ్తుండగా, అంబాజీపేట నుంచి మానేపల్లి వెళ్తున్న మరో మోటారు సైక్లిస్టు ఎదురెదురుగా ఢీకొన్నారని ఎస్సై వివరించారు. ఈ ప్రమాదంలో కళ్యాణ్ రామ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చొన్న రవికుమార్‌కు తీవ్ర గాయాలపాలవడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. మృతుడు కళ్యాణ్ రామ్ భార్య భారతి గల్ఫ్‌కు వెళ్లింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం



రాజోలులో మాట్లాడుతున్న కిషోర్

రాజోలు: వైఎస్సార్ సీపీ లోక్‌సభ పక్షనేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ అన్నారు. మంగళవారం ఆయన రాజోలులో విలేకరుల సమాశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ అరాచకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడం చేతకాక ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం పరిపాటిగా మారిందన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న మిథున్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్సైజ్ పాలసీకి ఎలా సంబంధం ఉంటుందని ప్రశ్నించారు. కేవలం రాయలసీమలో పెద్దిరెడ్డి కుటుంబానికి ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక అరెస్ట్‌ల పర్వానికి తెరతీశారన్నారు. అరెస్ట్‌లకు భయపడిపోయే నాయకులు వైఎస్సార్ సీపీలో లేరని, ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు నిలుస్తూ ఎన్ని అరెస్ట్‌లు చేసినా ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రూ.370 కోట్లు నేరుగా ప్రభుత్వం బదిలీ చేసినట్టు ఆధారాలు ఉన్నాయన్నారు.


ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కూటమి

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్, లోక్‌సభ ప్యానెల్ స్పీకర్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు పాటి శివకుమార్ అన్నారు. మంగళవారం రామేశ్వరంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకు వైఎస్సార్ సీపీ చేస్తున్న పోరాటాలను పక్కదోవ పట్టించేలా ఈ అక్రమ అరెస్టులకు కూటమి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. లిక్కర్ స్కామ్ అనేదే జరగలేదని, కావాలనే ప్రభుత్వం తప్పుడు కేసు పెట్టి అరెస్ట్‌ల పర్వానికి తెరతీసిందని దుయ్యబట్టారు.

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం



చింతలూరులో దుర్గాదేవి



చిరతపూడిలో వనువులమ్మ



అయినవిల్లిలో అన్నపూర్ణదేవి

ఆలమూరు/అంబాజీపేట/అయినవిల్లి: ఆలమూరు మండలంలోని చింతలూరు కాలువగట్టుపై వేంచేసిన దుర్గాదేవి అమ్మవారు మంగళవారం శాకంబరీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే కలవచర్లలోని గ్రామదేవత ఆకులమ్మను శాకంబరిగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. అంబాజీపేట మండలం చిరతపూడిలో గ్రామదేవత వనువులమ్మ అమ్మవారు భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సమకూర్చిన 200 కేజీల వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అలాగే సుమారు 200 రకాల పిండి వంటలతో సారెను సమర్పించారు. అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువుదీరిన అన్నపూర్ణదేవి అమ్మవారు మంగళవారం శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ కూరగాయలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి కానుకలు, మొక్కులు చెల్లించారు. మహిళా భక్తులు లలితా సహస్ర పారాయణ చేశారు.

తరచూ మాక్ డ్రిల్ నిర్వహించాలి



కొత్తపేటలో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో శ్రీకర్

కొత్తపేట: రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రమాదకర పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆర్డీవో పి.శ్రీకర్ పరిశ్రమల యాజమాన్యం, సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సంక్షోభ నివారణ కమిటీ (లోకల్ క్రైసిస్ గ్రూపు) సమావేశం ఆర్డీవో శ్రీకర్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల సమీపాన ఉంటున్న ప్రజలకు ఆయా పరిశ్రమలల్లో సంభవించే ప్రమాదాలపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ (కాకినాడ) కె.రాంబాబు మాట్లాడుతూ ప్రమాదకర కర్మగారాల్లో తీసుకోవలసిన భద్రత ప్రమాణాలు, ఈ కమిటీ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. స్థానిక ఎస్సై జి.సురేంద్ర, అగ్నిమాపక అధికారి విజయ్, మెడికల్, పంచాయతీరాజ్ సిబ్బంది, ఇతర కమిటీ సభ్యులు, డివిజన్ పరిధిలోని పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు వీడ్కోలు సన్మానం



బిళ్లకుర్రులో సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

కొత్తపేట: మండలంలోని బిళ్లకుర్రు గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ డి.సతీష్, వెల్ఫేర్ అసిస్టెంట్ వై.ప్రసాద్, వీఏఏ కె.రవికుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆర్.దిలీప్, ఏఎన్ఎం బి.విజయలక్ష్మి జిల్లాలో వివిధ సచివాలయాలకు బదిలీ అయ్యారు. వారి వీడ్కోలు సన్మానం మంగళవారం సచివాలయంలో ఘనంగా నిర్వహించారు. సభకు సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు అధ్యక్షత వహించగా ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన ఉద్యోగులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, దానికి నిదర్శనమే ఈ రోజు బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానమని అన్నారు. కొత్తగా వచ్చిన ఉద్యోగులు కూడా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అనంతరం బదిలీ అయిన పై ఉద్యోగులను సర్పంచ్ లక్ష్మీపతి ఆధ్వర్యంలో మండల ప్రజాప్రతినిధులు పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ సేవాదళ్ సభ్యుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ (జీపీ), ఎంపీటీసీ సభ్యుడు చిత్రపు ఆనందబాబు, మాజీ సభ్యుడు కముజు గంగాధరరావు, ఈఓపీఆర్డీ పి.సత్తిబాబు, పంచాయతీ సెక్రటరీ ఎంవీవీఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించాలి



ముక్కామలలో పశు వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో పాటు రైతులను ప్రోత్సహించి వారి ఆర్థిక పురోభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ముక్కామలలో నూతనంగా నిర్మించిన పశువైద్యశాలను సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి అధ్యక్షతన ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్‌ఐడీఎఫ్ నిధులు రూ.32 లక్షలతో పశువైద్యశాలను నిర్మించామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ వనచర్ల గంగాభవాని, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఎల్.విజయరెడ్డి, పశువైద్యులు శ్రీనివాస్, దీపిక, మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, కొర్లపాటి గోపి, దాసరి వీరవెంకట సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అదనపు గదులు లేక ఇబ్బందులు

పీహెచ్‌సీలో సరైన సౌకర్యాలు, అదనపు గదులు లేక వైద్య సేవలు అందించేందుకు రోగులు ఇబ్బందులు పడుతున్నారని వైద్య సిబ్బంది ఎమ్మెల్యే సత్యనారాయణకు వివరించారు. పీహెచ్‌సీని ఎమ్మెల్యే సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు చికిత్స అందించేందుకు గదులు లేవని, దాంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. అదనపు గదుల నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి తీసుకురావాలని వైద్య సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని కల్యాణం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం ఆర్జిత సేవగా స్వామి వారి శాంతి కల్యాణం బహుళ ద్వాదశి తిథి నాడు అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం విష్వక్సేన పూజతో అర్చకులు ప్రారంభించారు. వేదమంత్రాలతోను, మంగళవాయిద్యాల నడుమ కనుల పండువగా ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు పెద్దింటి వెంకట శ్రీనివాస్, వేద పండితులు ఈ కల్యాణం నిర్వహించా రు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం స్వామి మూలవిరాట్ దర్శనం, లడ్డూ ప్రసాదం ఇచ్చి, అన్న దాన పథకంలో భోజన సౌకర్యం కల్పించింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వ్యాధి నిర్ధారణ కాకుండా మందుల వాడకంపై విచారణ

కొత్తపేట: సమగ్ర రోగ నిర్ధారణ చేయకుండా ఒక వ్యాధికి సంబంధించి మందులు వాడించారని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై వైద్య విధాన పరిషత్ జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ కె.కార్తిక్ మంగళవారం విచారణ జరిపారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంతానికి చెందిన వీవీ పద్మశ్రీ అనే మహిళకు కాలిపై ఒకచోట స్పర్శ లేదని వానపల్లి పీహెచ్‌సీకి వెళ్లారు. పద్మశ్రీ కాలుపై స్పర్శ లేని ప్రాంతంలో బాల్‌పెన్‌తో పరీక్షించి, ఆరు నెలలు మందులు వాడాలని చెప్పి ఒక నెలకు మందులు ఇచ్చారు. ఆ మందులు వాడుతుండగా ఆమె ఆరోగ్యం క్షీణించి పరిస్థితి విషమించింది. దాంతో అమలాపురంలో ఓ ఆస్పత్రిలో చేర్చగా వైద్య సేవలు అందించారు. ఆమె వాడుతున్న మందులు పరిశీలించి ఇవి రోగానికి సంబంధించినవి కాదని అందుకే రియాక్షన్ వచ్చిందని నిర్ధారించారు. వ్యాధి నిర్ధారణ చేయకుండా ఏదో మందులిచ్చి తన భార్య విషమ పరిస్థితికి కారకులయ్యారని ఆమె భర్త సుబ్బారావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్పందించిన డీసీహెచ్‌ఎస్‌ను విచారణకు ఆదేశించారు. ఆ మేరకు ఆయన అవిడి పీహెచ్‌సీలో పలువురు అధికారులను, ఫిర్యాదిని విచారించారు. మరొక సిబ్బందిని, పేషెంట్‌ను కూడా విచారించవలసి ఉందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కార్తిక్ విలేకరులకు తెలిపారు.

భావ వ్యక్తీకరణ నైపుణ్యతను ఒడిసిపట్టాలి

మలికిపురం: ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగం దూసుకుపోతుందని.. అందులో ఉద్యోగం సాధించాలంటే డిగ్రీ మొదటి ఏడాది నుంచే భావవ్యక్తీకరణ నైపుణ్యాలను ఒడిసి పట్టాలని ఫ్లోరిడాకు చెందిన అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సంస్థ సాఫ్ట్‌వేర్ ప్రొడక్ట్ డైరెక్టర్ అల్లూరి రమేష్ వర్మ విద్యార్థులకు సూచించారు. స్థానిక ఎంవీఎన్‌జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో త్వరలో ప్రారంభం కానున్న కంప్యూటర్స్ హార్డ్‌వేర్, నిర్వహణ వర్క్‌షాప్, ధ్రువీకరణ పత్రం కోర్సుకు సంబంధించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రిన్సిపాల్ ఎస్.ఆనందమహాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రాడ్యుయేట్ ఫ్రెషర్లు ఇతర రంగాల కంటే ఐటీ రంగం వైపు మొగ్గు చూపుతున్నారని.. దీనికి కారణం ఈ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటం. అంతే కాకుండా వేతనం విషయంలో కూడా ఇతర రంగాల కంటే ఎక్కువగా ఆఫర్ చేస్తుండటమేనన్నారు. మన గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక, విశ్లేషణ, సమస్య పరిష్కార నిపుణత ఎక్కువ అని కాకపోతే ఇతరులతో భావాన్ని వ్యక్తం చేసే ఆంగ్ల పరిజ్ఞానం పొందడంలో వెనుకబడి ఉన్నామన్నారు. దానిని అభివృద్ధి చేసుకుంటే భవిష్యత్తు మనదేనన్నారు. కళాశాలలో జరగబోయే 45 రోజుల శిక్షణను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చిట్టాల సత్యనారాయణ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పీఎస్ఎన్ రాజు, కో కోఆర్డినేటర్ పీడీకే ప్రసాద్, కంప్యూటర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ అడ్డాల మణికంఠ, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సత్య విజయ్‌ప్రసాద్, హర్షిత, కృపా మాధురి, నవ్యకుమారి, దేవకి పాల్గొన్నారు.